ఈనాడు

18 August 2018

ఈనాడు

# సాగరంలో చేపల పెంపకం

- ఫలించిన తొలి ప్రయత్నాలు
- రాష్ట్రంలో 38చోట్ల అనువని ప్రాథమికంగా నిర్ధారణ
- మత్స్య రంగంలో విప్లవాత్మక మలుపు

ఈనాడు, విశాఖపట్నం: సముద్రంలో చేపల పెంపకంపై కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ(సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్- సీఎంఎఫ్ఆర్ఐ) అధికారులు చేసిన ప్రయత్నం పూర్తిస్థాయిలో విజయవంతమైంది. సముద్రంలోని నిర్ణీత ప్రాంతంలో వలలను బోను(కేజ్)లా ఏర్పాటుచేసి అందులో చేపల్ని పెంచడం ఇక్కడ ప్రత్యేకత. అందుకే దీనిని 'కేజ్ కల్చర్' అని వ్యాప్తి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తీరం వెంబడి 38 చోట్ల మనకు ఈ రకంగా చేపల పెంపకానికి అనువైన ప్రాంతాలున్నట్టు నిర్ధారించారు. మామూలుగా చేపల చెరువులు అనగానే ముందుగా వాటిని తవ్వుకోవడం, నీళ్లు పెట్టుకోవడం, వాటిని కొంతకాలం తరువాత మార్చుకోవడం, నిర్వహించడం తదితర బాధ్యతలుంటాయి. కేజ్ కల్చర్‌లో అలాంటివేమీ ఉండవు.



విశాఖ తీరంలో ఏర్పాటుచేసి వలల బోను

## ఇప్పటిదాకా ఏం జరిగిందంటే...

సముద్రంలో అలల ధాటికి, అంతర్గత ప్రవాహాలకు తట్టుకునే విధంగా వలల బోనులను(కేజ్‌లు) తయారుచేసి మూడేళ్లుగా దేశంలో 1,609 చోట్ల... అందునా విశాఖలో 11 చోట్ల చేపల్ని పెంచారు. ఏఎంఎఫ్ఆర్ఐ ప్రత్యేకంగా హేచరీలో అభివృద్ధి చేసిన గ్రూపర్, ఇండియన్ పాంపనో తదితర జాతుల చేప పిల్లలను ఇందుకు తీసుకున్నారు. గ్రూపర్ రకం కిలో చేపల్ని పెంచడానికి రూ.180 వ్యయం అవుతుండగా రైతుల నుంచి కొనుగోలు ధర రూ.300 నుంచి రూ.350 వరకు ఉండడంతో నూతన విధానం అత్యంత లాభదాయకమని తేల్చారు. ఒక్కో చేప సుమారు ఎనిమిది నెలలకు కేజీ బరువుకు, సంవత్సరం పూర్తయ్యే సరికి రెండు కేజీల వరకు బరువు పెరుగుతుంది.

## లాభాలెన్నో.....

- ★ భూమిపై సుమారు ఒక హెక్టారు(10,000 క్యూబిక్ మీటర్లు) విస్తీర్ణంలో పెంచే చేపల్ని సముద్రంలోని బోనుల్లో కేవలం 100 క్యూబిక్ మీటర్ల విస్తీర్ణంలోనే పెంచుకోవచ్చు.
- ★ స్థల కొరత, భూగర్భ జలాలు పాడవుతాయన్న బెంగలేదు.
- ★ సముద్రంలో ఏర్పాటుచేసే బోనుల్లో నీళ్లు ప్రవహిస్తూ ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. కాబట్టి చేపలకు వ్యాధులు, వైరస్‌ల బారిన పడడానికి అవకాశాలు చాలా తక్కువ.
- ★ సముద్రంలో బోను ఏర్పాటుచేసుకోడానికి భారీఎత్తున లీజులు చెల్లించక్కరలేదు. ప్రభుత్వ అనుమతి పొంది నామమాత్రపు రుసుములతో సాగుచేసుకోవచ్చు.

## సిద్ధమైన ముసాయిదా



సముద్రంలో చేపల పెపకం అత్యంత లాభదాయకమని నిర్ధారణవడంతో దీనికి సంబంధించి అవసరమైన విధివిధానాలను కేంద్రం ఖరారు చేస్తోంది. మారీకల్చర్ డ్రాఫ్ట్ పేరిట ముసాయిదా సిద్ధమైంది. రైతులకు సరిపడా సంఖ్యలో లక్షలాది చేపపిల్లలను అందుబాటులో ఉంచడానికి కూడా చర్యలు చేపట్టాం. చేపల పెంపకంలో మరో విప్లవం వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

–ఎ.గోపాలకృష్ణన్, డైరెక్టర్, సీఎంఎఫ్ఆర్ఐ, కొచ్చిన్